క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అయిదు గ్రామాల్లో మరామ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ దుర్గాప్రసాద్ గురువారం తెలిపారు. 113.తాళ్లూరు, వేమవరం, శిరంగిపాలెం, తక్కెళ్లపాడు, గరుడాచలపాలెం గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సహాయం



తాడేపల్లి రూరల్: క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ వ్యక్తికి మంగళగిరిలోని గివింగ్ బ్యాక్ టు సొసైటీ సంస్థ ఆర్థిక సహాయాన్ని అందించింది. ఆ సంస్థ అందించిన ఆర్థిక సహాయాన్ని గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మణిపాల్ హాస్పిటల్‌లో హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ కంటిపూడి సుధాకర్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. క్యాన్సర్ బాధితుడు పునీత్‌కుమార్‌కు గివింగ్ బ్యాక్ టు సొసైటీ రూ.2 లక్షలు ఆర్థిక సాయాన్ని అందించిందని తెలిపారు. సమాజ శ్రేయస్సుకు సేవా కార్యక్రమలు చేస్తున్న సంస్థ ప్రతినిధులను ఆయన అభినందిస్తున్నామన్నారు. సొసైటీ స్ఫూర్తితో బాధితుడికి మణిపాల్ హాస్పిటల్ తరుపున తగిన సహాయం అందజేస్తామని ఆయన తెలిపారు.

విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించాలి



దుగ్గిరాల: దుగ్గిరాల హౌసింగ్ కాలనీ దగ్గర విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన గురువారం మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల స్మార్ట్ మీటరు వ్యతిరేకించాలని, విద్యుత్ బిల్లులు తగ్గించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెట్టి బాలరాజు, స్టాలిన్, బ్రహ్మేశ్వర రావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వీడండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హెచ్చరించారు. మారీసుపేటలో గురువారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న గ్యాంగ్ వర్క్ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కాల్వలోని వ్యర్థాలను రోడ్ల ప్రక్కన పడవేయడాని గమనించిన ఆయన అసహనం వ్యక్తం చేశారు. వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. ఆయన వెంట పలువురు ఉద్యోగులు ఉన్నారు. అలాగే అమరావతి ప్లాట్స్‌లో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పలువురు ఉద్యోగులు ఉన్నారు.

సరస్వతీ దేవాలయం భూమిపూజ రేపు



తెనాలి: పట్టణ బుర్రిపాలెం రోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూలు దగ్గర నూతనంగా నిర్మించనున్న 'సువర్ణ భారతి క్షేత్రం' (సరస్వతి దేవాలయం)కు ఈనెల 7న జరగనున్న భూమి పూజ ఆహ్వాన పత్రికను గురువారం ఆవిష్కరించారు. స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యా పీఠంలో సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ)చే ఆరోజు ఉదయం 7.45 గంటలకు విశేష హోమాలు, పూజలు ఆధ్యాత్మిక ప్రవచనాలు జరుగుతాయని తెలిపారు. బాలస్వామీజీతో పాటు ట్రస్ట్ ఛైర్మన్ నంబూరి వెంకటకృష్ణమూర్తి, కార్యదర్శి రావూరి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, కోశాధికారి గోపు రామకృష్ణ, తాడిబోయిన వీరరాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్త వంతెనకు మోక్షమెప్పుడు!



మోరంపూడి కాలిబాట వంతెన



ఇటీవల మరమ్మతులు చేపట్టిన రేవేంద్రపాడు శిథిలావస్థ వంతెన

- రేవేంద్రపాడు వంతెన వద్ద వాహనాల రద్దీతో అధికంగా ట్రాఫిక్
- ప్రయాణ సౌకర్యాలు లేక ఇబ్బందుల్లో ప్రజలు

దుగ్గిరాల: కూటమి పాలనలో గ్రామాల పురోగతి కుంటుపడుతోంది. మండలంలోని ప్రధాన కాలువ దాటడానికి చిన్న పాటి వంతెనను కూడా నిర్మించక ప్రస్తుత ప్రభుత్వం కాలం వెళ్లదీస్తుంది. పెరిగిన జనాభా, ప్రజా అవసరాల దృష్ట్యా మోరంపూడి గ్రామ సమీపంలో వంతెన నిర్మించడం ద్వారా దూరం తగ్గడం, సమయం, డబ్బు ఆదా కానుంది. దుగ్గిరాల మండల పరిధిలోని ప్రధాన కాలువపై రేవేంద్రపాడు గ్రామంలోని వంతెన శిథిలావస్థకు చేరింది. ఈ వంతెన నుంచి 11 కిలో మీటర్లు ప్రయాణిస్తే దుగ్గిరాలలో మరో వంతెన ఉంది. 40 ఏళ్ల క్రితం రేవేంద్రపాడు వంతెనను నిర్మించారు. ఈ వంతెన ముందుకాలంలో దెబ్బతింటే ఈ రెండు వంతెనల మధ్య 4 కాలిబాట వంతెనలు ఉన్నాయి. వీటిలో నాలుగు చక్రాల వాహనాలు వెళ్లడం సాధ్యంకాని పని. కాబట్టి అధికారులు ముందుగానే మేల్కొంటే దుగ్గిరాల ప్రధాన కాలువపై మరో వంతెన నిర్మాణం చేపట్టి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించవచ్చు.

ప్రయాణానికి తప్పని ఇక్కట్లు..

దుగ్గిరాల మండలంలో మోరంపూడి, పేరుకలపూడి, శృంగారపురం, పెదపాలెం, చినపాలెం, పెదకోందూరు, గొడవర్రు గ్రామాలు కలవు. కొల్లిపర మండలంలో వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు గ్రామాలు కలవు. ఈ రెండు మండలాల ప్రజలు ప్రయాణ మార్గానికి సరిపడా వంతెనలు లేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఇక్కడ రోడ్ల నిర్మాణాలు జరగడంలేదని.. ఫలితంగా డొంక రోడ్లే ప్రయాణానికి దిక్కయ్యాయని అంటున్నారు. ఎదురెదురు వాహనాల రాకలతో ట్రాఫిక్ సైతం ఏర్పడుతోంది. దీంతో ప్రయాణానికి ఇక్కట్లు తప్పడం లేదని గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

> ఒకానొకప్పుడు గొడవర్రు గ్రామంలో బల్లకట్టు (నాటు పడవలు) ప్రమాదంలో ఈ ప్రధాన కాలువలో నలుగురు మృతి చెందగా 13 మంది గల్లంతయ్యారు. అప్పటి దివంగత మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి ఈ ఘటనపై చలించిపోయి బల్లకట్టులను అప్పుడు నిషేధించారు. వాటి స్థానంలో కాలిబాట వంతెనలను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. రాష్ట్ర మొత్తం ఇటువంటి నిర్మాణాలను నిర్మించారు. దీంతో పెద్ద మొత్తంలో ప్రమాదాలను నివారించగలిగారు.

హామీని విస్మరించిన కూటమి ప్రభుత్వం..

తాము అధికారంలోకి వస్తే పేరుకలపూడి వంతెన నిర్మాణానికి చర్యలు చేపడతామని నారా లోకేష్ ఎన్నికల హామీల్లో భాగంగా గ్రామ మ్యానిఫెస్టోలో పేర్కొన్నారు. మంత్రిగా అధికారాన్ని చేపట్టిన లోకేష్ నేడు కనీసం ఇటు వైపు కూడా చేడడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ ఈస్ట్ బైపాస్ నిర్మించాలని రూప కల్పన చేశారు. కానీ ప్రభుత్వం మారడంతో అది రద్దు చేశారు. ఒక వేళ ఈస్ట్ బైపాస్ కొనసాగినట్లయితే ఈ గ్రామాల రూపురేఖలు మారేవని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. మంత్రి లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా

మంగళగిరి టౌన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ కార్యదర్శి హరి జవహర్‌లాల్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. నేటి నుంచి 50 వేల మొక్కలు నాటే దిశగా చర్యలు చేపట్టామని.. ప్రస్తుతం 1200 మొక్కలను నాటామని ఆయన తెలిపారు. ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా మొక్కలను నాటి భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకర సమాజాన్ని అందిద్దామన్నారు. అడిషనల్ కమిషనర్ శకుంతల, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ సిబ్బంది, అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: పర్యావరణ రక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో పర్యావరణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించి మొక్కను నాటారు. కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



దుగ్గిరాలలో మొక్కలు నాటుతున్న అధికారులు

దుగ్గిరాల: అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమం దుగ్గిరాలలో గురువారం పంచాయతీ పరిధిలో నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో 200 మొక్కలు నాటారు. గ్రామ సర్పంచ్ ఖుషిబాయి, డిప్యూటి ఎంపీడివో కె.జె.నెహ్రూ, ఈవో కె.వివేకానంద, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: ప్రతి ఒక్కరూ చెట్లు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఏపీఎస్ఆర్టీసీ జోన్-3 ఈడీ జి.నాగేంద్రప్రసాద్ అన్నారు. నగర పరిధిలోని ఆర్టీసీ డిపోలో గురువారం ఆయన మొక్కలు నాటారు. గుంటూరు సీఎంఈ కె.సత్యనారాయణ, మంగళగిరి డిపో మేనేజర్ పిచ్చయ్య, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

తెనాలిరూరల్: వివాహిత అదృశ్యమైన ఘటన త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణ త్రీ టౌన్ స్టేషన్ పరిధిలో నివసించే 23 ఏళ్ల ప్రైవేటు స్కూలు టీచర్ కుటుంబ కలహాల నేపథ్యంలో బుధవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లారు. గురువారం నాటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మోహన్‌రావు సేవలు చిరస్మరణీయం

తెనాలిటౌన్: సీపీఎం సీనియర్ నాయకుడు కామ్రేడ్ గాలిముట్టి మోహనరావు సేవలు చిరస్మరణీయమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ పేర్కొన్నారు. స్థానిక చంద్రబాబు నాయుడు కాలనీలోని నివాసం వద్ద మోహనరావు భౌతికాయాన్ని నేతలు సందర్శించి ఘన నివాళులర్పించారు. రైస్, డాల్‌మిల్ యూనియన్ నాయకుడుగా కార్మికుల హక్కుల కోసం మోహనరావు చేసిన కృషి అనిర్వచనీయమని గుర్తు చేసుకున్నారు. సుదీర్ఘకాలం సీపీఎం పార్టీలో సేవలందించారని అన్నారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. మోహనరావు భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో కె.బాబుప్రసాద్, డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి, ములకా శివసాంబిరెడ్డి, షేక్ హుస్సేన్‌వలీ, జి.ఆగస్టీన్, కె.రవి, ఎస్.రాజ్యలక్ష్మి, చుక్కపల్లి శేషగిరిరావు, జి.వెంకటసుబ్బయ్య, తదితరులు ఉన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలిఅర్బన్: శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి ఆధ్వర్యంలో సాయిబాబా గుడి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో గురువారం వైష్ణవి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాసరావు సహకారంతో మజ్జిగను పంపిణీ చేశారు. సమితి నిర్వాహకులు కుర్రా శ్రీను మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సిహెచ్.శ్రీనివాసరావు, పి.నవీన్, అబ్రహాం, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ వెళ్ళిన ఉద్యోగులు

తెనాలిఅర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో గురువారం జరగనున్న మహాసభలకు తెనాలి నుంచి పలువురు ఉద్యోగులు ప్రత్యేక బస్సులో వెళ్లారు. వివిధ ఉద్యోగ సంఘనాయకులు శివరాత్రి శ్రీనివాసరావు, అందె బాలచంద్రమౌళి, కారుమూరి కమలకుమారి, మనోహర్‌రెడ్డి, దగ్గుపాటి సుధీర్‌కుమార్, గుంటూరు పూర్ణప్రసాద్, దీపాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం

మంగళగిరి టౌన్: ఎస్సీ వర్గీకరణ రోస్టర్ మొదటి వరుసలో మాదిగలకు 7 శాతం ఇవ్వాలని.. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లో గురువారం ఆంధ్ర మాదిగ సంఘాల రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలను వర్గీకరణ లేకుండా దొడ్డిదారిన పాత జీవోను అడ్డుపెట్టుకుని 16 వేల ఉద్యోగాలను చంద్రబాబు ప్రభుత్వం విడుదల చేస్తుందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పునకు భిన్నంగా వ్యవహరించడం చంద్రబాబుకు సరికాదని హెచ్చరించారు. తమిళనాడు తరహాలో 3 శాతం రిజర్వేషన్లు అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆంధ్రాలో మందకృష్ణ వల్లే మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శెట్టి సృజనారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు దాచేపల్లి రామాంజనేయులు, అరుంధతి బందుసేవ అధ్యక్షులు వరసాయి ప్రసాద్, బేడ బుడగ జంగాల సంఘం జాతీయ అధ్యక్షులు వనం నాగేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీస్ నాయకులు

కొనసాగిన వ్యవసాయ, ఉద్యాన అధికారుల శిక్షణ

ప్రకృతి వ్యవసాయ క్షేత్ర సందర్శన

తెనాలి: గుంటూరు జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన అధికారులకు జరుగుతున్న మూడు రోజుల ప్రకృతి వ్యవసాయ శిక్షణలో భాగంగా గురువారం విస్తృతంగా ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్ నేచురల్ ఫార్మింగ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కొల్లిపర మండలంలోని దావులూరిపాలెం గ్రామంలో రైతు పృధ్వి అరటి ఏ-గ్రేడ్, ఏటీఎం పంట పొలాలను సందర్శించారు. తదుపరి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.రాజ కుమారి ప్రకృతి వ్యవసాయంలో జీవన ఉత్ప్రేరకాలు తయారీ గురించి ప్రత్యక్షంగా వివరించారు. అనంతరం రైతు వసంతమ్మ ఏటీఎం, అరటిలో వేసిన ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ పొలం, శ్రీలక్ష్మీ న్యూట్రి గార్డెన్‌ను సందర్శించారు. దావులూరులో గొట్టుముక్కల శ్రీధర్ వరి ప్రధాన పంటపై అమలు చేస్తున్న ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ మోడల్ 25 ఎకరాల బ్లాక్ ను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతను, వివిధ మోడల్స్ అమలులో ఉన్న విశిష్టతలను డీపీఎం రాజకుమారి వివరించారు. స్టేట్ టీం బాజీబాబు, అడిషనల్ డీపీఎమ్, వ్యవసాయశాఖ, ఉద్యాన అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



దావులూరులో ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్ మోడల్ పొలం సందర్శన

నిరుపేద యానాదులకు నూతన వస్త్రాలు పంపిణీ

తెనాలి: రూరల్ మండల గ్రామం కొలకలూరులో కాలవగట్టు పక్కన చెట్లకింద జీవిస్తున్న నిరుపేద యానాదుల సమక్షంలో గురువారం తెనాలికి చెందిన సినీదర్శకుడు దిలీప్‌రాజా జన్మదినాన్ని నిర్వహించారు. అక్కడి కుటుంబాలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. విద్యుత్, తాగునీరు లేని ఆ నిరుపేద కుటుంబాల మధ్యన రోజంతా గడపటం మరచిపోలేని అనుభూతిగా తెలిపారు. జన్మదిన వేడుకల పేరిట కేక్ కటింగ్ వంటివి తనకు నచ్చవని చెప్పారు. చెట్ల కింద దయనీయంగా బతుకుతున్న యానాదులకు తాగునీటి వసతి కోసం మంచినీటి పంపును ఏర్పాటుచేస్తానని హామీనిచ్చారు. బసవరత్న, బున్నీ పాల్గొన్నారు.

మధురకవి అబ్రహాం రచనలు స్ఫూర్తిదాయకం



నివాళులర్పిస్తున్న త్రీటౌన్ ఎస్ఐ షేక్ కరిముల్లా

తెనాలిటౌన్: మధురకవి నూతక్కి అబ్రహాం రచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని త్రీటౌన్ ఎస్ఐ షేక్ కరిముల్లా పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో గురువారం మధురకవి నూతక్కి అబ్రహాం 26వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. గ్రామ పురవేదిక వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుర్రం జాషువా ప్రియ శిష్యునిగా ఎన్నో రచనలకు అబ్రహాం శ్రీకారం చుట్టారని కొనియాడారు. అబ్రహాం కొలకలూరు గ్రామంలో జన్మించడం గర్వకారణంగా ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో అయినాల మల్లేశ్వరరావు, బర్తిపూడి వెంకటేశ్వరరావు, సుద్దపల్లి నాగరాజు, ఉన్నం ధర్మారావు, కూచిపూడి మోహన్ మాదిగ, కొలకలూరి పాపారావు, నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి, నూతక్కి అచ్యుతచారి, ఉన్నం భూషణం, సొపాటి కోటేశ్వరి, గద్దె ఝాన్సీ, ఉన్నం సన్నీ, అనిల్, స్వరాజ్ వర్మ, అవినాష్, సతీష్, మణిహర నాయుడు, తదితరులు ఉన్నారు.

పిక్చర్ పోస్టు కార్డులు విడుదల



ఉండవల్లి గుహల ప్రాముఖ్యతను వివరించే పోస్ట్ కార్డులను విడుదల చేస్తున్న అధికారులు

మంగళగిరి టౌన్: తాడేపల్లిలోని ఉండవల్లి గుహల ప్రాముఖ్యతను వివరిస్తూ గురువారం పోస్టల్ డిపార్ట్‌మెంట్, పురావస్తు శాఖ సహకారంతో ఉండవల్లి గుహల వద్ద అయిదు పిక్చర్ పోస్టు కార్డులను విడుదల చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డీఎస్‌వీ ఆర్ మూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పిక్చర్ పోస్టు కార్డులు ఉండవల్లి గుహల్లో కొలువైన విష్ణుమూర్తి విగ్రహం ప్రాధాన్యతను, ఆ గుహల శిల్ప కళాకృతులను తెలియజేసే విధంగా రూపొందించినట్లు తెలిపారు. ఈ పోస్టు కార్డులను ప్రతి ఒక్కరూ దగ్గరలోని ప్రధాన పోస్ట్ ఆఫీస్‌లో లేదా సబ్ పోస్ట్ ఆఫీసులో కానీ రూ. 150 చెల్లించి పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోస్టల్ సర్వీసెస్ డైరెక్టర్ కె.సంతోష్ నేత, ఆర్కియాలజిస్ట్ డిపార్ట్‌మెంట్ సూపరింటెండెంట్ డాక్టర్ డేజేంద్రనాథ్, గుంటూరు పోస్టాఫీస్ సూపరింటెండెంట్ యు.యల్లమందయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ జి.శివనాగరాజు, ప్రముఖ ఫిలాటెలిస్టు చల్లా అప్పారావు, తపాలా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తితిదే నిత్యాన్నదానానికి కూరగాయలు వితరణ



జెండా ఊపి కూరగాయల వాహనాన్ని ప్రారంభిస్తున్న ఢిల్లీరావు

తాడేపల్లి రూరల్: అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని విజయవాడ క్లబ్ రోడ్ నివాసితులు ఎన్ఎస్‌వీ ప్రసాద్ నన్నపనేని, రేవతి దంపతులు.. అక్షయిత, శ్రీహిత కుటుంబ సభ్యుల సహకారంతో తిరుమల తిరుపతి దేవస్థానం నిత్య అన్నదాన నిర్వహణకు 10 టన్నుల కూరగాయలు వితరణ చేశారు. ఆ వాహనాన్ని ఢిల్లీరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తుల కోసం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సాయం చేసే అవకాశం సామాన్యులకు కూడా కల్పించడం ఎంతో ముదావహమన్నారు. నన్నపనేని ప్రసాద్, రేవతి దంపతులు మాట్లాడుతూ.. కూరగాయలను విరాళంగా అందిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమ నిర్వాహకులు మరడ నాగేంద్ర మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని కీర్తిశేషులు మండవ కుటుంబరావు 2006లో ప్రారంభించారని తెలిపారు. గత 18 ఏళ్లుగా తితిదేకు కూరగాయలను వితరణగా అందిస్తున్నామన్నారు.

కార్పొరేట్ అనుకూల విధానాల కోసం సీఎం తాపత్రయం



సమావేశంలో మాట్లాడుతున్న నేతాజీ

తాడేపల్లి రూరల్: కార్మికుల శ్రమను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా దోచి పెట్టడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాపత్రయ పడుతున్నారని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు వై.నేతాజీ అన్నారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కోట బాబూరావు అధ్యక్షత నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్మిక చట్టాల సవరణ చేస్తూ 8 గంటల పని విధానం స్థానంలో 12 గంటలు, 15 గంటలు పనిచేయాలని మోదీ ప్రభుత్వం తీసుకు వచ్చిన విధానాలను రాష్ట్రంలో అమలు చేయాలని చంద్రబాబు చూస్తున్నారని విమర్శించారు. మహిళలు నైట్ డ్యూటీ చేయాలని క్యాబినెట్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం అన్యాయమని అన్నారు. జూలై నెలలో 23, 24వ తేదీల్లో గుంటూరులో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం మహా సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, వెంగమ్మ, రేణుక, బొక్క సాంబశివరావు, తాడేపల్లి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు బకాయిలు చెల్లించాలి



కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న స్టీవెన్

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఇప్పటికైనా కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని యూనియన్ కార్యదర్శి కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా స్టీవెన్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికులకు మాత్రం న్యాయం జరగడం లేదని మండిపడ్డారు. గత 32 ఏళ్లుగా కార్మికుల సమస్య సమస్యగానే మిగిలిందని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అయినా యాజమాన్యంతో చర్చించి కార్మికులకు రావాల్సిన బకాయిలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సూర్యప్రకాష్‌రావు, పిచ్చయ్య, ఇస్మాయిల్, నాగేశ్వరరావు, ఆశీర్వాదం, రమాదేవి, శివమ్మ, ఇమాంబి, రమణ, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం

దుగ్గిరాల: మంగళగిరి నగరంలో ఈనెల 13న జరిగే ఎమ్మార్పీఎస్ జిల్లా స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకులు ఏటుకూరి విజయకుమార్ మాదిగ కోరారు. గురువారం చిలువూరు గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జూలై 7వ తేదీన జరిగే ఎమ్మార్పీఎస్ 31వ వార్షికోత్సవాన్ని ఒంగోలు జిల్లా నాగులుప్పాడు మండలంలోని ఈదుమూడి గ్రామంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మాదిగ, మాదిగ ఉప కులాలు కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లీగల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు మాదిగ, శేఖర్ మాదిగ, శ్రీనివాసరావు మాదిగ, దాసు మాదిగ, బాబు రావు మాదిగ, భూషణం మాదిగ, ఇశ్రాయేలు మాదిగ, శ్రీధర్ మాదిగ పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

తాడేపల్లి రూరల్: రైతు, కౌలు రైతుల సమస్యలపై ఈనెల 11వ తేదీన మంగళగిరిలోని ఏపీ ఐసీఎల్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు పిలుపునిచ్చారు. గురువారం తాడేపల్లి రూరల్ పరిధిలోని గుండిమెడ గ్రామంలో రైతు సంఘం నాయకులతో కలిసి కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఎన్నికల వాగ్దానంలో రైతులను, కౌలు రైతులను ఆదుకుంటామని చెప్పారని.. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా ఇప్పటికీ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వలేదని విమర్శించారు. భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులతో పాటు కౌలు రైతుల ఖాతాల్లోనూ అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు రాష్ట్ర ప్రభుత్వం జమ చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, కౌలు రైతులు రత్తయ్య, వీరయ్య, కుమార్, పాములు తదితరులు పాల్గొన్నారు.

